క్లుప్తంగా

నవోదయకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈఓలు అబ్బాయి, వరలక్ష్మి

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తి గ్రామానికి చెందిన విద్యార్థిని ఎటపాక నవోదయ పాఠశాలకు ఎంపికైంది. లింగంపర్తి సత్రం పంపు కాలనీలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థిని మరుకుర్తి లక్ష్మీప్రసన్న నవోదయకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు గిరీశ్వరరావు శనివారం తెలిపారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎంఈఓలు అబ్బాయి, వరలక్ష్మి విద్యార్థిని లక్ష్మీప్రసన్నను అభినందించి ఎంపిక పత్రం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఒ.రాజు, ఎస్.రాజు, రవి, పద్మ, తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఏలేశ్వరం: గత నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ గురువులుగా ఎంపికైన వారిని పట్టణంలో శనివారం ఘనంగా సన్మానించారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యాయులుగా ఎంపికైన హెచ్ఎంలు లక్ష్మీతులసి, వీర్రాజు, మండల ఉత్తమ ఉపాధ్యాయులు రాజశేఖర్, గణపతి రావు, ప్రభాకరరావు, నాగసుజాత, సత్యనారాయణమ్మ తదితరులకు శాలువాలు కప్పి పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జట్ల సోమరాజు, సుందరరావు, రాంబాబు, నాగమణి, రవి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీఓ

తుని రూరల్: మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనువుగా ఆహారపు అలవాట్లు, పర్యావరణ పరిరక్షణ, డిజిటలీకరణ తదితర అంశాలపై గర్భిణులు, బాలింతలు అవగాహన పెంచుకోవాలని తుని ప్రాజెక్టు స్త్రీ శిశు సంక్షేమ అధికారి కె.శ్రీలత అన్నారు. శనివారం పట్టణంలోని వీరవరపేట సెక్టార్ రావాడ వీధిలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన సదస్సు, సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్న ప్రాశన కార్యక్రమాలు నిర్వహించారు. బిడ్డ ఆరోగ్యవంతంగా జన్మించాలంటే గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, నవజాతి శిశువుకుసైతం తల్లిపాలు తాగించాలన్నారు. అందుబాటులో ఉన్న ఆకు కూరలు, కూరగాయలు, చిరుధాన్యాలతో తయారు చేసే వంటకాలను ఆహారంగా తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల సంక్షేమానికి కృషి

ఏలేశ్వరం: ఆటోడ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. పట్టణంలో శనివారం వాహనమిత్ర పథకంలో భాగంగా పథకం సొమ్మును లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అధ్యక్షతన నియోజకవర్గవ్యాప్తంగా 1,561 మంది ఆటోడ్రైవర్లకు రూ.15వేల చొప్పున రూ.2.34కోట్ల చెక్కును మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీలు తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, సానా సతీష్, జిల్లా కలెక్టర్ షన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా

తుని రూరల్: పట్టణంలోని వాహనమిత్ర పథకం నిధుల పంపిణీ కార్యక్రమాన్ని యనమల రాజేష్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. నియోజకవర్గంలోని 1,472 మంది లబ్ధిదారులకు రూ.15 వేలు చొప్పున రూ.2,22,800 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించినట్లు ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ నార్ల భువన సుందరి, ఏఎంసీ చైర్మన్ అంకంరెడ్డి రమేష్, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, నాయకులు చింతంనీడి నాగ సోమరాజు, చోడిశెట్టి గణేష్, వెలుగుల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వాహన మిత్ర నిధుల పంపిణీ

జగ్గంపేట: నియోజవర్గంలోని ఆటో డ్రైవర్లకు జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వాహన మిత్ర పథకం నిధులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ పాల్గొన్నారు. 1,688 డ్రైవర్లకు మంజూరు అయిన మొత్తం నిధుల చెక్కును లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారులు, మండల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టు..బంగారం

- అనుకూల వాతావరణంతో రైతుల ఆసక్తి
- కిలో పట్టు ధర రూ.601
- కేంద్ర జౌళి శాఖ రాయితీల ప్రకటన



దొండవాకలో పట్టు పురుగులకు మేత వేస్తున్న రైతులు

తుని రూరల్: తక్కువ విస్తీర్ణంలో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం ఆర్జించేందుకు మల్బరీ సాగు మంచి మార్గం. సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయ పంట ఇది. అందుకే జిల్లాలోని తుని చుట్టుపక్కల అనేక గ్రామాల రైతులు మల్బరీ సాగుపై ప్రత్యేక దృష్టి సారించారు. సత్ఫలితాలనూ సాధిస్తున్నారు. మల్బరీ సాగు సహా పట్టు పురుగుల పెంపకం ద్వారా లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఫలితంగా సాగు చేసిన రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి.

పట్టుపురుగుల పెంపకంతో పట్టుగూళ్ల ఉత్పత్తితో రైతులు ఉపాధి పొందుతున్నారు. మరికొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు బై ఓల్టిన్, మార్చి నుంచి ఆగస్టు వరకు క్రాస్‌బ్రీడ్ (సీబీ) రకాలను రైతులు ఉత్పత్తి చేస్తున్నారు. బైఓల్టిన్ శీతల వాతావరణంలోను, సీబీ అధిక ఉష్ణోగ్రతలను తట్టుకుంటాయి. దీంతో సెప్టెంబరులో మొదటి వారంలో విత్తనాన్ని వేసిన బైఓల్టిన్ రకం పట్టుగూళ్లు చేతికి అందడంతో శనివారం హనుమాన్ జంక్షన్ కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లి రైతులు విక్రయించారు. నాణ్యతను బట్టి రూ.324 నుంచి రూ.601 వరకు గిట్టుబాటు ధర లభించినట్టు రైతులు తెలిపారు. కేంద్ర జౌళిశాఖ మరో రూ.50 వరకు అదనపు ప్రోత్సాహకం అందిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం పట్టుగూళ్లకు ఆశాజనకంగా గిట్టుబాటు ధర లభిస్తోందని రైతులు పేర్కొన్నారు.

మెట్టలో పరిస్థితులు అనుకూలం

తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాలు మెట్ట ప్రాంతం కావడంతో మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపకం, పట్టుగూళ్ల ఉత్పత్తికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. 25 రోజుల్లోనే పంట చేతికి అందడం, సంవత్సరం మొత్తంగా 11 నుంచి 12 పంటలు పండించే అవకాశం ఉండడంతో పట్టుగూళ్ల ఉత్పత్తిపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. దీంతో వందలాది మంది రైతులు పట్టుగూళ్ల ఉత్పత్తిపై దృష్టి సారించారు. కేంద్రప్రభుత్వం సైతం ప్రోత్సహకాలు అందిస్తోంది. మూడు నియోజకవర్గాల్లో వందకుపైగా రేరింగ్ షెడ్లలో పట్టుగూళ్ల ఉప్పత్తి జరుగుతుంది.

దిగుబడి

పట్టుగూళ్ల ఉత్పత్తిలో ప్రధానంగా మూడు దశలు ఉంటాయి. మల్బరీ సాగు, చాకీ దశ, పట్టుపురుగులు పెంపకం ప్రధానమైనవి. ఒక్కొక్క రేరింగ్ షెడ్డులో వంద రేరింగ్స్ చొప్పున పెంచడం ద్వారా 60 నుంచి 70 కిలోలు పట్టుగూళ్ల ఉత్పత్తి సాధించవచ్చు. కొంతమంది రైతులు 150 నుంచి 200 రేరింగ్స్ వేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు.



నేత్రికల నుంచి పట్టుగూళ్లను సేకరిస్తున్న మహిళలు

రాయితీలు

ఎకరంలో మల్బరీతోట, రేరింగ్ షెడ్డు నిర్మించుకుని పట్టుగూళ్ల ఉప్పత్తి చేసే రైతులకు కేంద్ర జౌళిశాఖ రాయితీలు అందిస్తోంది. మల్బరీతోట సాగుకు రూ.30వేలు ఖర్చవుతుంది. ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 75 శాతం రాయితీగా అందిస్తున్నారు. రేరింగ్ షెడ్ల నిర్మాణానికి రూ.4.50 లక్షలు అవుతుండగా ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 70 శాతం రాయితీ చెల్లిస్తున్నారు. రేరింగ్ షెడ్లలో పరికరాలు, నేత్రికలకు రూ.75 వేలు ఖర్చవుతుండగా ఎస్సీ, ఎస్టీలకు రూ.90 శాతం, ఇతరులకు 75 శాతం అందిస్తున్నారు. సంవత్సరానికి ఒకసారి రేరింగ్ షెడ్లు శుభ్రపర్చుకునే మందులకు ఎస్సీ, ఎస్టీలకు రూ.4,500, ఇతరులకు రూ.3,750లు ప్రోత్సహకాలను అందిస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మల్బరీ తోటల సాగుకు కూలీల ఖర్చుగా రూ.64 వేలు చొప్పున ఇస్తున్నారు.

103 కేజీల దిగుబడి

రేరింగ్ షెడ్‌లో 150 రేరింగ్స్ వేశాను. 22 రోజులు కంటికి రెప్పలా పట్టుపురుగులను పెంచాను. కూలీలతో పట్టుగూళ్లను నేత్రికల నుంచి సేకరించాం. 103 కిలోల పట్టుగూళ్లు ఉత్పత్తి అయ్యాయి. హనుమాన్ జంక్షన్ కొనుగోలు కేంద్రంలో విక్రయించాను.

– చింతల వెంకటరమణ, రైతు, కేఏ.అగ్రహారం

గిట్టుబాటు ధర బాగుంది

ఈ సీజన్‌లో మొదటిసారిగా ఉత్పత్తి చేసిన పట్టుగూళ్లకు మంచి ధర లభించింది. వంద రేరింగ్స్ పెట్టగా 25 రోజుల పంటకాలానికి 70 కిలోలు పట్టుగూళ్లు ఉత్పత్తి అయ్యాయి. కిలో రూ.520 చొప్పున ధర గిట్టుబాటయ్యింది. ఖర్చులుపోను లాభం వచ్చింది.

– గుడపర్తి మాతయ్యనాయుడు, రైతు, డి.పోలవరం

నిరంకుశ పాలనకు మూల్యం తప్పదు



కిర్లంపూడిలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన గిరిబాబు, నాయకులు

కిర్లంపూడి: కూటమి నిరంకుశ పాలనకు మూల్యంచెల్లించుకోక తప్పదని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు ముద్రగడ ప్రద్మనాభం నివాసంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. అనంతరం గిరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులు వివరాలు డిజిటల్ బుక్‌లో నమోదు అవుతాయని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకోంటామన్నారు. అధికార పార్టీ నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు టోల్ ఫ్రీ నంబర్ 040–4917178 కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. మాజీ ఎమ్మెల్యే అంగూరి లక్ష్మీశివకుమారి, జిల్లా ఉపాధ్యక్షుడు బెహరదొరబాబు, జెడ్పీటీసీ బెహర రాజేశ్వరీ, కన్వీనర్లు రామిశెట్టి నాని, చింతకాలయ సత్యన్నారాయణ, నరాల శ్రీను, గొల్లపల్లి సురేష్, గౌతు స్వామి, గొల్లపల్లి కాశీ, రామిశెట్టి ఏసుబాబు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంగా చేయడమే కర్తవ్యం



కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు

కిర్లంపూడి: జగనన్నను మళ్లీ సీఎంగా చేయడమే మన అందరి కర్తవ్యమని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. కిర్లంపూడిలో శనివారం ఆయన స్వగృహంలో ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబును పలువురు నేతలు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎన్నికలు ఎప్పుడు సమీపించిన పార్టీ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ పట్టుదలతో కృషి చేయాలన్నారు. ముద్రగడను కలిసిన వారిలో పార్టీ రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ శాసన సభ్యులు రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ ప్రచార కమిటీ మాజీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, మాజీ కార్పోరేటర్లు మానే దొరబాబు, వాకచర్ల కృష్ణ, ఎంపీపీలు కుప్పాల దుర్గారావు, సుంకర వెంకటరెడ్డి, తదితర నేతలు ఉన్నారు.

బాధితులకు తోట నరసింహం పరామర్శలు



డాక్టర్ శ్రీరాములను పరామర్శిస్తున్న తోట నరసింహం



గండేపల్లిలో మృతుడి కుటుంబానికి భరోసా కల్పిస్తున్న తోట నరసింహం

జగ్గంపేట: నియోజకవర్గ కేంద్రం జగ్గంపేటకు చెందిన సీనియర్ వైద్యుడు గోలి శ్రీరాములు సతీమణి రెండు రోజులు క్రితం మృతి చెందారు. విషయం తెలిసుకున్న వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి తోట నరసింహం శనివారం గోలి శ్రీరాములను పరామర్శించారు. తమ ప్రగాడ సానుభూతిని వారి కుటుంబానికి తెలియచేశారు. ఆయన వెంట నియోజకవర్గ పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి తోట భరోసా

గండేపల్లి: మండలంలోని వివిధ కారణాలతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబాలకు మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ తోట నరసింహం భరోసా కల్పించారు. గండేపల్లికి చెందిన పార్టీ కార్యకర్త, ఫోటోగ్రాఫర్ భాస్కరిణి నాగ వీర వెంకట రంగబాబు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం మృతుడి కుటుంబాన్ని కలిసి సానుభూతి వ్యక్తం చేసి, పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం రామయ్యపాలెంలో ఇటీవల మృతి చెందిన మైలవరపు ఆదిరాజు కుంటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకుర్తి మూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, పార్టీ రాష్ట్ర ఐటీ విభాగం జనరల్ సెక్రటరీ తాళ్లూరి మధు కుమార్, జగ్గంపేట మండల పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, నీలాద్రిరావుపేట సర్పంచ్ ములంపాక సురేష్, నేతలు చలగళ్ల వెంకట్రావు, తాళ్లూరి కృష్ణ, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు



సీతంపేటలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

శంఖవరం: చిరుధాన్యాల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్‌కుమార్ సూచించారు. స్థానిక సీతంపేట యాదవ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన చిరుధాన్యాలపై మెగా మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జాతీయ ఆహారభద్రత పోషణ మిషన్‌లో భాగంగా రైతులకు రాగి విత్తనాలు రాయితీపై అందజేసి నాణ్యమైన దిగుబడులతో పోషకాహారం పొందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు పండించిన చిరుధాన్యాలను మద్దతు ధరలతో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం చిరుధాన్యాల సాగుకు మేలైన యాజమాన్య పద్ధతులు అనే పుస్తకాన్ని విడుదల చేసి రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఎలియాజర్, జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకుడు డి.మాలకొండయ్య,మండల వ్యవసాయాధికారి పి.గాంధీ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి మాలధారణ



రాచపల్లి అరుణాచల క్షేత్రంలో పూజలు చేస్తున్న స్వాములు

ప్రత్తిపాడు రూరల్: మండలం రాచపల్లిలో ప్రముఖ పుణ్యక్షేత్రం అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం అయ్యప్పస్వామి భక్తులు పెద్ద ఎత్తున మాలధారణ చేపట్టారు. గురుస్వామి మార్గదర్శకత్వంలో భక్తులు పవిత్ర స్నానాలు చేసి, స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మాలధారణ స్వీకరించారు. అయ్యప్పస్వామి దీక్ష చేపట్టిన భక్తులతో ఆలయ ప్రాగాణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

57 ఎకరాల ఆలయ భూమి కౌలుకు త్వరలో వేలం

తొండంగి: పిఠాపురం శ్రీసంస్థాన సత్రం భూముల కౌలు వేలంకు సంబంధించి వేలం ప్రక్రియ సక్రమంగా జరగలేదంటూ తమకు న్యాయం చేయాలని పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో హైకోర్టు ఉత్తర్వుల మేరకు సోమవారం 57 ఎకరాల భూమికి మరలా కౌలువేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థాన సత్రం అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సత్రంకు చెందిన 478 ఎకరాలకు మూడేళ్ల కాలపరిమితికి కౌలువేలం ప్రక్రియను గతంలో తొండంగి శివాలయంలో నిర్వహించారు. అప్పట్లో ఈవేలం ప్రక్రియ అధికార కూటమి పార్టీ నేతల ఆధ్వర్యంలో నిర్వహించారని, పోలీసులకు కూడా వారికి వత్తాసు పలకడంతో తమకు అన్యాయం జరిగిందని పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో రైతులు పేర్కొన్న 57 ఎకరాల భూమికి మళ్లీ వేలం నిర్వహించాలని దేవదాయ ధర్మాదాయశాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో సోమవారం వేలం ప్రక్రియను తొండంగి శివాలయంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారైనా రైతులకు అన్యాయం జరగకుండా కూటమి పార్టీ నేతల ఒత్తిడి లేకుండా వేలం ప్రక్రియను అధికారులు సామరస్యంగా నిర్వహిస్తారని రైతులు భావిస్తున్నారు.

క్వారీ నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీరమణి

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాలెం గ్రామంలోని సర్వేనెంబరు 1/1పిలో 28.760హెక్టార్లలో సాలీన 10.55 లక్షల క్యూబిక్ మీటర్లు రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్ తవ్వకాలు జరిపేందుకు, మరో 1.26లక్షల క్యూబిక్ మీటర్లు సాధారణ మట్టి తవ్వకాలకు సంబంధించి క్వారీ నిర్వహణ కోసం కాకినాడకు చెందిన మెస్సర్ చోడే సురేష్ పెట్టుకొన్న దరఖాస్తుపై శనివారం పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, కాలుష్య నియంత్రణ మండలి ఇన్‌చార్జ్ ఈఈ ఏఎస్ఆర్సీ మూర్తి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణానికి ఎలాంటి హాని కల్గకుండా, ఇళ్ల దెబ్బతినకుండా బ్లాస్టింగ్ చేపట్టాలని, ఇబ్బందులు తలెత్తకుండా రవాణా సాగించాలని, స్థానికులకు ఉపాధి, మౌళిక సదుపాయాలు కల్పించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ఎన్జీవోలు, సమీప ప్రజలు కోరారు. సంబంధిత నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పిస్తామని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు. ఎస్‌వీ నరేష్, ఏఎస్సై వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి దుర్గమ్మ



ప్రత్తిపాడులో బోనాలతో అమ్మవారి ఊరేగింపు

ఏలేశ్వరం: శ్రీదేవి శరన్నవరాత్రల ముగింపులో భాగంగా శనివారం అమ్మవారి విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలుగ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను భారీ ఊరేగింపుల నడుమ ఘనంగా నిమజ్జనం చేశారు. పట్టణంలోని తోటవీధి, సంతోషిమాత ఆలయం, లింగవరంకాలనీల్లోని అమ్మవారి విగ్రహాలను మెయిన్‌రోడ్, బాలాజీచౌక్, దిబ్బలపాలెం, మార్కెట్‌వీధి, పల్లపువీధి మీదుగా ఊరేగించి ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భారీ ఎత్తున బాణాసంచా ఏర్పాటు చేశారు. మహిళలు, యువకులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల సందడి

గండేపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి నిమజ్జన వేడుకలను శనివారం పలు గ్రామాల్లో భక్తులు అట్టహాసంగా నిర్వహించారు. గండేపల్లి వెంకటేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన విజయ దుర్గాభవాని అమ్మవారికి గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అనంతరం నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మునసబు గారి రామాలయం వద్ద తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న దుర్గమ్మ అమ్మవారిని శనివారం ఘనంగా నిమజ్జన మహోత్సవం నిర్వహించారు. దసరా ముగింపు సందర్భంగా శనివారం అమ్మవారిని సామూహిక కుంకుమ పూజలు, బోనాలతో సాగనంపారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారిని ఆశీనులు గావించాగా మేళతాళాలతో, బాణాసంచా కాల్పుల నడుమ అమ్మవారిని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించి స్థానిక పుష్కర కాలువలో నిమజ్జనం చేశారు.

అంగరంగ వైభవంగా ఊరేగింపు

గోకవరం: శ్రీవీరభద్రుని గద్దెలో వెలసియున్న కనక దుర్గమ్మ శరన్నవరాత్ర మహోత్సవాలు సందర్భంగా శనివారం అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు కంచర్ల నరసింహమూర్తి, రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ఊరేగింపును ప్రారంభించారు. గరగ నృత్యాలు, కోలాటం, నవదుర్గ వేషధారణలు, తీన్మార్ డప్పులు, నృత్యాలతో కోలాహలంగా సాగింది. మంగళవారం ఆలయ సన్నిధిలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలియజేశారు.

వైభవంగా మహా పూర్ణాహుతి

గండేపల్లి: మండలం గండేపల్లిలో మహర్షి జ్యోతిషాలయం అమ్మవారి పీఠంలో మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు దేవీ ఉపాసకులు బ్రహ్మశ్రీ దువ్వూరి శేషగిరి శాస్త్రి సిద్ధాంతి ఆధ్వర్యంలో జరిగిన దేవీ నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా 11 రోజుల పాటు హోమాల పరిపూర్ణత, ప్రజల శుభీక్షం కోసం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఆయన వివరించారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ఏలేశ్వరంలో దుర్గాదేవి అమ్మవారిని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు



గండేపల్లిలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, చిన్నారులు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



కాకినాడ జీజీహెచ్‌లో బాధితుడికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న మురళీ కృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన తోట బాబ్జి భవాని మాలధారణలో చేపట్టిన పాదయాత్రలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడిని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు శనివారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన కిల్లాడి చిన్న భార్య అనారోగ్యంతో కాకినాడ సూర్య గ్లోబల్ హాస్పటల్లో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు వేట్లపాలెం విద్యార్థులు

సామర్లకోట: రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు వేట్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికై నట్టు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టరు యార్లగడ్డ బంగార్రాజు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన బాలికలు, బాలురు పాల్గొన్నారని చెప్పారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఐదురుగు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎ.శ్రీధర్ 55 కేజీల విభాగంలోను, కె.గౌతమ్ 80 కేజీల విభాగంలోను, కె.ప్రవీణ్ 52 కేజీల విభాగంలోను, డి.హారిక 65 కేజీల విభాగంలోను, డి.సింధుష 62 కేజీల విభాగంలో ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, గ్రామ సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ గోలి శ్రీరామ్, పాఠశాల హెచ్ఎం అనురాధ, విద్యాకమిటీ చైర్మన్ శివ, పీఈటీ ఎండీ ఇబ్రహీం అభినందించారు.